

## పదోతరగతి పరీక్షలు పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలి

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి
- పరీక్షా కేంద్రాల సందర్శన

**మేడ్చల్, నేడు బ్యూరో:** పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. సోమవారం కలెక్టర్ జిల్లాలోని శామీర్ పేట్ మండలం హాకీంపేట్ లోని తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్లో పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తరగతి గదులను సందర్శించి విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మంచినీరు, లైట్లు, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాలు ఉన్నాయా అని జిల్లా విద్యా శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో మొత్తం ఎంత మంది పరీక్ష రాసే విద్యార్థులు ఉన్నారని, అందులో గైరుహాజరు ఎంతమంది అని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జిల్లా విద్యా శాఖ అధికారి విజయ కుమారి, శామీర్ పేట్ మండల తహసీల్దారు సుచరిత తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమకారులకు అండగా నాగుర్ల

### ఆపదలో ఉన్న ఉద్యమకారుడికి అపన్న హస్తం

**పరకాల, నేడు న్యూస్ :** ఉద్యమకారులకు ఎప్పుడు అండగా ఉంటానని, ఉద్యమకారుడు తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. కష్టకాలంలో వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఆపదలో ఉన్న వారికి ఎల్లప్పుడు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు భరోసాను కల్పించారు.నాగుర్ల వెంకటేశ్వర్లు ఆదేశానుసారం ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సందెల సునీల్ ఆధ్వర్యంలో గీసుకొండ మండలం,గొర్రెకుంట గ్రామానికి చెందిన ఉద్యమకారునికి ఉద్యమ కారులు మరియు కొంతమంది దాతలు ఆర్థిక సాయం అందించిన సహాయం మొత్తం రూ.38,016 జమ చేసి, ఇట్టి మొత్తాన్ని నాగుర్ల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఎం జి ఎం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న తోటి ఉద్యమకారుడు అయిన కోట ప్రవీణ్ కి అందించారు.ఈ కార్యక్రమం లో ఉద్యమకారుల సంఘం నాయకులు గుర్రం రఘు, మిద్దెపాక విజయ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## భగత్ సింగ్ ఆశయాలు నెరవేర్చాలి

### ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్

**పరకాల, నేడు న్యూస్ :** నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం రోజున అమరవీరుల దినోత్సవం సందర్భంగా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవుల చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మరియు ఉపాధ్యాయులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ 1928 లో ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు లాలా లజపతిరాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగ తీర్చుకోవడానికి ఫిరోజ్పూర్ లో బ్రిటిష్ పోలీస్ అధికారి జెపి సాండర్స్ ను హత మార్చినందుగాను 1931 మార్చి 23న భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు లను బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసిందన్నారు. మనుషులను చంపగలరు వారి ఆదర్శాలను కాదు అని, దేశ సేవలో జీవితాలనే త్యాగం చేసి భవిష్యత్ తరాల కోసం బంగారు బాటలు వేసిన మహానుభావులని అన్నారు.భారతదేశం తన దాస్య శృంఖలాలను తెంచుకుని స్వేచ్ఛా వాయువులు పీల్చడానికి తమ ప్రాణాలను దారబోసిన అమరవీరులు భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు ల త్యాగాలను స్మరించుకుందాం. వారి ఆశయ సాధనలో పునరంకితం అవుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, కంచరాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కలు పెంచడం పర్యావరణ పరిరక్షణకు ఎంతో కీలకం

### ఎం. వేణు మాధవ్.. మేడ్చల్ జిల్లా అటవీ శాఖ అధికారి

**మేడ్చల్, నేడు బ్యూరో:** మొక్కలను పెంచడం పర్యావరణ పరిరక్షణకు ఎంతో ముఖ్యమని మేడ్చల్ జిల్లా అటవీ శాఖ అధికారి ఎం. వేణు మాధవ్ అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అటవీ శాఖ ధూలపల్లి రేంజ్ పరిధిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వేణు మాధవ్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అందులో భాగంగా, సోమ వారం మార్చి 23న జిల్లాలోని దూలపల్లి ఫారెస్ట్ రేంజ్ లోని ఆక్సిజన్ పార్క్ లో 300 లు, ఆయుష్ వనం పార్క్ లో 300 ల మొక్కలను నాటి అంతర్జాతీయ అటవీ



దినోత్సవం ప్రాముఖ్యతను చాటారు. ఈ కార్యక్రమంలో దూలపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.లక్ష్మణ్, జిల్లా సిబ్బంది ప్రణయ్, గీతిక, వాలంటీర్లు పాల్గొన్నారు.

# 'డబుల్స్' వాణిజ్య సముదాయాల వేలం ప్రజాప్రయోజనాలకు విరుద్ధం

- ఎస్.వీరయ్య - సిపిఐ (ఎం ) కేంద్ర కమిటి సభ్యులు
- తక్షణమే వేలం ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్
- లేదంటే చలో - అసెంబ్లీనే
- వేలాన్ని నిరసిస్తూ మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట సిపిఐ ( ఎం ) ధర్నా




**మేడ్చల్, నేడు బ్యూరో:** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం మార్చి 23న సిపిఐ (ఎం ) జిల్లా కమిటీ ధర్నా నిర్వహించింది. జిల్లాలోని డబుల్ బెడ్ రూం కాలనీలోని వాణిజ్య సముదాయాల వేలాన్ని ఆపాలని కోరుతూ ఈ ధర్నాను నిర్వహించింది. ఈ ధర్నాలో పాల్గొన్న పేదలను ఉద్దేశించి సిపిఐ (ఎం ) కేంద్ర కమిటి సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ,మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని 16 డబుల బెడ్ రూమ్ కాలనీలలోని 992 వాణిజ్య సముదాయాలను వేలం పాట ద్వారా విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన ఈ డబుల్ బెడ్ రూం కాలనీల నిర్వాహణ బారం కాలనీవాసులపై పడకుండా ఉండేందుకు వాణిజ్య సముదాయాలు నిర్మించిందని, ఈ వాణిజ్య సముదాయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని లిఫ్టులు, వాటర్, డ్రైనేజీ, పైప్ లైన్ల మరమత్తులకు వాడొచ్చని భావించారని వెల్లడిస్తూ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని వేలం ద్వారా విక్రయిస్తే మెయింటెనెన్స్ ఖర్చులు కాలనీవాసులకు భారంగా మారుతాయన్నారు. అందుకని తక్షణం వాణిజ్య సముదాయాలను వేలం విక్రయించడాన్ని ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కాలనీల్లో జిల్లా వ్యాప్తంగా అంగన్వాడి, వైద్య, విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ, లిఫ్ట్, నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ఇదే ధోరణితో ఉంటే మేడ్చల్ జిల్లాలో నివసిస్తున్న డబుల బెడ్ రూమ్ కాలనీ వాసులతో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని వీరయ్య హెచ్చరించారు. సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి పి. సత్యం మాట్లాడుతూ, డబుల్ బెడ్ రూం కాలనీలో అసంపూర్ణంగా ఉన్న పనులను పూర్తి చేయడానికి, మరమ్మత్తులు చేపట్టడానికి ప్రభుత్వమే తగిన బడ్జెట్ కేటాయించాలన్నారు. మురారిపల్లి ఇతర డబుల బెడ్ రూమ్ కాలనీలకు తక్షణమే మంచినీటి పైపులైన్లు వేసి అప్పగించాలన్నారు. డబుల్ బెడ్ రూం వాణిజ్య సముదాయాల విక్రయాన్ని ఆపడానికి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన స్థానిక ఎమ్మెల్యేలను కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించని యెడల తామే చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ (ఎం ) మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వినోద, అశోక్, సభ్యులు రాథోడ్ సంతోష్, లింగస్వామి, నరేష్, సబిత, వెంకన్న, గణేష్, నర్సింగ్ రావు, బాలపీర్, విజయ్, శ్రీనివాస్, ఆంజనేయులు, సురేష్, హమ్మద్ గూడ డబుల బెడ్ రూమ్ కాలనీల నాయకులు విజయ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లాలో ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి

### షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడు : ఏఐవైఎఫ్

**మేడ్చల్ నేడు బ్యూరో:** షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని అఖిల భారత యువజన సమాఖ్య (ఏ.ఐ.వై.ఎఫ్) మేడ్చల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సల్మాన్ బేగ్, టి. సత్య ప్రసాద్ లు అన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘట్కేసర్, ఉప్పల్, ఇ.సి. ఐ.ఎల్, జవహర్ నగర్, అల్వాల్, కుత్బుల్లా పూర్, కూకట్ పల్లి తదితర ప్రాంతాల్లో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కా యాదర్శులు సల్మాన్ బేగ్, టి. సత్య ప్రసాద్ లు మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ నిర్వహించిన పాత్ర యావత్ దేశం విస్మరించరానిదన్నారు. 12 ఏళ్ళ వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, 23 ఏళ్ళ ప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి, ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలిచి,





దేశ భక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవ మూర్తి భగత్ సింగ్ అని కొనియాడారు. 1907 సెప్టెంబర్ 28న జన్మించిన భగత్ సింగ్ 23 ఏళ్ళ చిరు ప్రాయంలోనే 1931 మార్చ్ 23న తన సహచరులు రాజ్ గురు, సుఖ్ దేవ్ లతో కలిపి బ్రిటిష్ మూఖరులచే ఉరితీయబడ్డారని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావ శీల విప్లవకారులలో భగత్ సింగ్ అగ్రగణ్యుడని, ఈ కారణంగానే షాహీద్ గా దేశ ప్రజలు కొనియాడారని వారు గుర్తు చేశారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్ కు నేటి తరం అందించగలిగే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా మహిళ కన్వీనర్ జి.స్వప్న, ఏఐవైఎఫ్ ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షులు ఏ.వికాస్ రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఈ .సతీష్ కుమార్, కౌశిక్, కిరణ్ కుమార్, రజిత, శాంభవి, మేఘన, అనిరుద్ రెడ్డి, సురేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడిలకు రూ.26వేల వేతనం చెల్లించాలి

- జిల్లా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్
- జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం దాఖలు

**మేడ్చల్, నేడు బ్యూరో:** అంగన్వాడి టీచర్లకు, హెల్పర్లకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో రిటైర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ ఇవ్వాలని, అంగనవాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ పై పనిభారం తగ్గించాలి తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియం మేడ్చల్ జిల్లా కమిటి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం మేడ్చల్ జిల్లా కమిటి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. సునీత, బి.శోభారాణి లు జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాకు వివరాలు వెల్లడించారు.

అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ ను కార్మికులుగా గుర్తించాలని, రూ.26 వేల వేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్ర హుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో అంగన్వాడిలకు రూ.18 వేల వేతనం ఇస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారనీ, అయితే కాంగ్రెస్ పార్టీ అధికారానికి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా పై అంశాలను అమలు చేయాలని వారి ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శివరాణి, జిల్లా నాయకులు శ్రీలత ,రాణి, షైన్, సిఐటియూ జిల్లా కార్యదర్శి ఎ.అశోక్ , లింగస్వామిలు పాల్గొన్నారు.

## కెపిహెచ్బి కాలనీలో తాగునీటి సరఫరాపై వినతి పత్రం

**కూకట్‌పల్లి, నేడు న్యూస్:** కెపిహెచ్బి కాలనీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి కెపిహెచ్బి సర్కిల్ వాటర్ వర్క్స్ డి జి యం త్రినాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని వసంత నగర్ పరిసర కాలనీలలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా సక్రమంగా అందించాలని వినతి పత్రం అందజేశారు. డి జి యం త్రినాథ్ కి ఈ నియోజకవర్గం లో పూర్తి అవగాహన ఉందని, పూర్వం ఆయన చేసిన పనితీరును సాయిబాబు చౌదరి గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత చేస్తున్న అభివృద్ధి ఫలాలను అట్టడుగున ఉన్న ప్రతి పేదవారికి అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఆదేశాల మేరకు ప్రతి కాలనీలో తిరుగుతూ ప్రజా సమస్యలపై ముందుకు



సాగుతున్నామని ఆయన తెలియజేశారు. కాబట్టి ఈ వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా సవ్యంగా జరగాలని త్రినాథ్ ను కోరారు.

## 25 ఏళ్ల నిరీక్షణకు ముగింపు

### పోలంపల్లిలో ఇంటి దారి సమస్యకు హేమలత బాలాజీ శాశ్వత పరిష్కారం

**కారేపల్లి, నేడు న్యూస్:** పోలంపల్లి గ్రామపంచాయతీ రెండో వీధిలో దాదాపు 25 సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా ఉన్న ఇంటి దారి సమస్యకు సర్పంచ్ ధరావత్ హేమలత బాలాజీ చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న స్థానికులు ఈ చర్యపై హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి గ్రామ ప్రజల సమస్యలను తనవిగా భావిస్తూ ఒక్కొక్కటిగా పరిష్కరించడంపై హేమలత బాలాజీ దృష్టి సారిస్తున్నారు. ఎల్ఎల్‌బీ విద్యను అభ్యసించిన ఆమె, గ్రామంలోని ప్రతి వీధి పరిస్థితిని స్వయంగా తెలుసుకొని, సమస్యల మూలాలను గుర్తించి పరిష్కార చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో రెండో వీధిలో ఉన్న ఇంటి దారి సమస్యను పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి తక్షణ చర్యలు తీసుకొని పరిష్కరించడం గమనార్హం. సమస్య పరిష్కారంతో స్థానికులకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అనుచరుడు బోడ సెట్ రామ్ నాయక్, ఉప సర్పంచ్ గుగులోత్ సర్వం తదితరులు



పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజాసౌకర్యాల మెరుగుదల లక్ష్యంగా మరిన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి కొనసాగిస్తానని సర్పంచ్ హేమలత బాలాజీ తెలిపారు.



## ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా లింగాల భూపాల్

### నూతన కమిటీ కార్యవర్గాన్ని అభినందించిన పలువురు పాత్రికేయులు

### ప్రెస్ క్లబ్ అభివృద్ధి కోసం పాటుపడుతా: లింగాల భూపాల్

**ఘట్‌కేసర్, నేడు న్యూస్:** ఘట్‌కేసర్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షునిగా లింగాల భూపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఘట్‌కేసర్ ప్రెస్ క్లబ్ లో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ ప్రెస్ క్లబ్‌కు నూతన అధ్యక్షుడిగా లింగాల భూపాల్ ఎన్నిక కావడం జర్నలిస్టుల వర్గాల్లో ఆనందాన్ని నింపింది. ఎన్నికల పర్యవేక్షకులుగా గోవింద్ రాజ్ గౌడ్, శ్రీనివాస రెడ్డి వ్యవహరించి పారదర్శకంగా



ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా లింగాల భూపాల్ (నమస్తే తెలంగాణ), ఉపాధ్యక్షుడిగా కుంటోళ్ల యాదగిరి (మన తెలంగాణ), ప్రధాన కార్యదర్శిగా కొండా శ్రీనివాస్ రెడ్డి (సాక్షి), సంయుక్త కార్యదర్శిగా సల్లూరి నర్సింగ్ రావు (ప్రజాపక్షం), కోశాధికారిగా లంబ రాజు (సూర్య) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సలహాదారులుగా మేడబోయిన నర్సింహ్మా (వార్త), ఫోతేధార్ రామకృష్ణ (ఈనాడు), మేకల పద్మారావు (విశాలాంధ్ర) బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానిస్తూ సహచర జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన లింగాల భూపాల్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రెస్ క్లబ్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గంట సత్యనారాయణ (సాక్షి), నిరంజన్ (నమస్తే తెలంగాణ), నామాల శ్రీనివాస్ (నవతెలంగాణ), గుర్రం రమేశ్ (సూర్య), శివరాత్రి సాయికిరణ్ (నవతెలంగాణ) తదితరులు పాల్గొన్నారు.



## మాజీ జడ్పీటీసీ సతీమణిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్

### సర్పంచ్ బాబురావుకు పూలతో నివాళులు

**కారేపల్లి, నేడు న్యూస్:** మండలంలోని భాగ్యనగర్ తండాకు చెందిన సింగరేణి మండల మాజీ జడ్పీటీసీ వాంకుడొత్ జగన్ నాయక్ సతీమణి ఇటీవల మోకాళ్ల శస్త్రచికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో, వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ సోమవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాత కమలాపురం గ్రామ సర్పంచ్ తేజవత్ బాబురావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో, వారి చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు సమర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఇక అదే గ్రామానికి చెందిన కట్ల ఫకీరయ్య భార్య కట్ల భద్రమ్మ మృతి చెందిన విషయమై, వారి కుటుంబ సభ్యులు మరియు కుమారుడు కట్ల తిరుపతయ్యను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంఘం మండల మాజీ అధ్యక్షుడు ధరవత్ పాండ్య నాయక్, మాజీ మండల రైతుబంధు కన్వీనర్ గుగులోత్ శ్రీను, ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాంకుడొత్ నరేష్, స్థానిక నాయకులు కొత్త తిరుపతయ్య, కాటన్నీ రామారావు, తోటకూరి తిరుపతయ్య, తోటకూరి వెంకటేశ్వర్లు, కొడిమళ్ల వెంకన్న, కొర్ర నాగేశ్వరరావు, తేజవత్ కిషన్, సపావట్ కోటి, పాత కమలాపురం యూత్ అధ్యక్షుడు భూక్య నందు, భూక్య రవి, శ్రావణ్, రాజేష్, కోటి, దారావత్ వెంకట్, గిరిజన నాయకులు భూక్య రాంకిషోర్ నాయక్, బాణోత్ రాజేష్ నాయక్, ఎన్టీఆర్ సేవా సమితి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కొత్త వెంకట్ చౌదరి పాల్గొన్నారు.

## ఎంపీ రఘురామ రెడ్డి చొరవతో సింగరేణికి తాగునీటి నాలుగు హ్యాండ్‌బోర్ల మంజూరు



**కారేపల్లి, నేడు న్యూస్:** వేసవి కాలం సమీపిస్తుండగా సింగరేణి మండల పరిధిలోని పలు గ్రామాల్లో త్రాగునీటి కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, ప్రజల సమస్యను గుర్తించిన ఎంపీ రఘురామ రెడ్డి నాలుగు హ్యాండ్‌బోర్లను మంజూరు చేశారు. మాదారం, పేరేపల్లి, గుంపలగూడెం, చిన్నమడంపల్లి గ్రామపంచాయతీలకు ఒక్కో హ్యాండ్‌బోర్ చొప్పున మంజూరు చేయడం ద్వారా గ్రామస్తులకు త్రాగునీటి సమస్యకు ఉపశమనం కలగనుంది. ఈ సమస్యను స్థానిక నాయకులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణ స్పందనతో చర్యలు చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇమ్మడి తిరుపతిరావు మాట్లాడుతూ, జిల్లాలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే ఉన్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మండలాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని అన్నారు. ప్రతి గ్రామానికి త్రాగునీరు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎంపీ రఘురామ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మాదారం సర్పంచ్ అజ్మీర ఉమా--నరేష్, గుంపలగూడెం సర్పంచ్ కృష్ణవేణి--వీరబాబు, పేరేపల్లి సర్పంచ్ బానోత్ పద్మావతి--వీరభద్రు, చిన్నమడంపల్లి సర్పంచ్ బానోత్ పద్మ--రూప్లా నాయక్ తదితరులు ఈ నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తూ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.



## ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్ చేతుల మీదుగా భూక్య రంజిత్ కుమార్‌కు సన్మానం

### సింగరేణి మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడిగా నియామకం

**కారేపల్లి. నేడు న్యూస్:** సింగరేణి మండల ఎంపీడీవో కార్యాలయంలో ఈరోజు గాదెపాడు గ్రామ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్‌ను సింగరేణి మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడిగా నియమితుడైన సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, సర్పంచ్ల సంఘం అధ్యక్షుడిగా భూక్య రంజిత్ కుమార్ మండలంలోని గ్రామాల అభివృద్ధి కోసం సమన్వయంతో పని చేయాలని ఆకాంక్షించారు. మండలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సర్పంచులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గ్రామానికి చేరేలా కృషి చేయాలని సూచించారు. భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## మురుగు కూపంగా బండ్లగూడ

### పట్టించుకోని అధికారులు, నరకం చూస్తున్న స్థానికులు

**కీసర నేడు న్యూస్:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ డివిజన్ బండ్లగూడ లో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ పైపులు అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతోంది. ఈ దుస్థితి వల్ల ప్రధాన రహదారులు మురుగు చెరువులను తలపిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నిలిచిన మురుగునీటి వల్ల వెలువడుతున్న భయంకరమైన దుర్వాసనతో స్థానికులు కనీసం ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. రోడ్డుపై మురుగునీరు నిలిచి ఉండటంతో పాదచారులు, వాహనదారులు ప్రయాణించడానికి నానా అవస్థలు పడుతున్నారు. మురుగునీటిలో గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణం వల్ల దోమలు పెరిగి, డెంగ్యూ, మలేరియా వంటి అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి, వెంటనే డ్రైనేజీ పైపులను శుభ్రం చేయించి, మురుగునీరు రోడ్లపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని బండ్లగూడ వాసులు కోరుతున్నారు.

# రెడ్డి సంఘాల ఐక్యత దిశగా కార్యాచరణ

- నేడు అన్ని ప్రధాన రెడ్డి సంఘాల ప్రత్యేక సమావేశం
- రెడ్లపై జరుగుతున్న సామాజిక దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం
- నేడు హైదరాబాద్ లో జరిగే రెడ్డి సంఘాల ప్రత్యేక సమావేశానికి తరలిరండి
- తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘాల అడ్ హక్ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎన్నంపల్లి లింగారెడ్డి






**హైదరాబాద్, నేడు ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రధాన రెడ్డి సంఘాల ఐక్యత దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని రెడ్డి సంఘాల అడ్ హక్ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎన్నంపల్లి లింగారెడ్డి తెలిపారు. రెడ్ల పై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న సామాజిక దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సోమవారం 'నేడు' ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ.. రెడ్ల పై జరుగుతున్న సామాజిక దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నేడు (మంగళవారం) హైదరాబాద్ వేదికగా అన్ని ప్రధాన రెడ్డి సంఘాల ప్రతినిధుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన సమావేశంలో రెడ్ల సమస్యలపై ప్రత్యేక చర్చ జరిగిందని ఆయన వివరించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రధాన రెడ్డి సంఘాలతో కలిపి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 24న మంగళవారం(నేడు) హైదరాబాద్ నాగోల్ ప్రాంతంలోని బండ్లగూడ రోడ్డులో గల పీఎంఆర్ కన్వెన్షన్ లో ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశం జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని ప్రధాన రెడ్డి సంఘాల నాయకులు పాల్గొంటారని ఆయన వివరించారు. తెలంగాణ సమాజంలో కొందరు వ్యక్తులు, వ్యవస్థలు ఉద్దేశ్యపూర్వకంగా రెడ్లపై తప్పుడు అభిప్రాయాలు కలిగించడానికి వివిధ వేదికలు, మాధ్యమాల ద్వారా, వక్రీకరించిన వార్తలతో రెడ్లపై ద్వేషాన్ని పెంచేలా అసత్యాలు వ్యాప్తి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెడ్ల పై జరుగుతున్న సామాజిక దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి ఈ సమావేశానికి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే రెడ్ల హక్కులను రక్షించడానికి సంఘటిత శక్తియే మార్గమని భావించిన అన్ని ప్రధాన రెడ్డి సంఘాలు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశాయని ఎన్నంపల్లి లింగారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి సంబందించిన అన్ని విషయాలను రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లా, మండల, గ్రామ స్థాయి రెడ్డి సంఘాలకు వివరించి భవిష్యత్ కోసం, భద్రత కోసం ఒక సంఘటిత శక్తిగా ముందుకు సాగాలని కోరారు. నేడు హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర అన్ని ప్రధాన రెడ్డి సంఘాలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లుగా ఆయన వివరించారు. ఈ చారిత్రాత్మక సమావేశానికి అన్ని రెడ్డి సంఘాల బాధ్యులందరు తప్పనిసరిగా హాజరుకావాలని ఎన్నంపల్లి లింగారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## నేటి యువతకు భగత్ సింగ్ ఆదర్శప్రాయుడు

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్
- పీర్జాదిగూడలో షాహీద్ భగత్ సింగ్ 95వ వర్ధంతి
- భగత్ సింగ్ కి భారత రత్న ప్రకటించాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చి, జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలి
- భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల పోరాట స్పూర్తితో నేటి విద్యార్థి, యువత తమ హక్కుల కోసం ఉద్యమించాలి
- ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్



**మేడిపల్లి, నేడు న్యూస్:** నేటి యువతకు విప్లవ వీరుడు షాహిద్ భగత్ సింగ్ ఆదర్శప్రాయుడని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పాల్గొని భగత్ సింగ్ చిత్రపటం వద్ద పుష్పగుచ్చాలను ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అలాగే పీర్జాదిగూడ ఉప్పల్ డిపో సమీపంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయం వద్ద భగత్ సింగ్ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ.. భగత్ సింగ్ 20 సంవత్సరాల వయసులోనే బ్రిటిష్ వారిని గడ గడ లాడించి, 23 సంవత్సరాల వయసులో భారత మాత దాస్య శృంఖలాలను విడిపించడం కోసం ఉరి కొయ్యలను ముద్దాడి భారతీయులలో విప్లవాగ్నిని రగిలించిన యోధుడన్నారు. భగత్ సింగ్ అంటేనే ఒక మండే అగ్నిగోళం, జ్వలించే నిప్పుకణిక దేశ స్వాతంత్ర్యం కోసం తన స్నేహితులు రాజ్ గురు, సుఖ్ దేవ్ లతో కలిసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగించి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ఉరికొయ్యను ముద్దాడారని తెలిపారు. వారి స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థి, యువత పోరాడాలని, నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హరీష్, అరవింద్, శ్రీహరి, సాయి ఈశ్వర్, అభిషేక్, సిద్దు, వంశీ, మహేష్, గణేష్, ఆకాష్ పాల్గొన్నారు.

# బీజేపీ నేతల ముందస్తు అరెస్ట్

### ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు



**మేడ్చల్, నేడు న్యూస్ :** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపునిచ్చిన 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమం మేడ్చల్మండలంలో ఉద్రిక్తతకు దారితీసింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన బీజేపీ సీనియర్ నాయకులను మేడ్చల్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మేడ్చల్ నుండి భారీ ఎత్తున కార్యకర్తలతో తరలివెళ్లేందుకు సిద్ధమైన బిజెపి నాయకులను, కార్యకర్తలను పోలీసులు వారి నివాసం వద్ద అడ్డుకున్నారు. శాంతి భద్రతల దృష్ట్యా ఈ ముందస్తు అరెస్టులు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు :**

పోలీసుల చర్యను బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై గొంతెత్తుతుంటే అక్రమ అరెస్టులతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని అరెస్టులు చేసినా బీజేపీ కార్యకర్తల పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రామచందర్ రావు నాయకత్వంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి తీరుతామని హెచ్చరించారు.





## ప్రభుత్వ వివక్షకు నిరసనగా.. రేపు జర్నలిస్టుల ఛలో హైదరాబాద్



**హైదరాబాద్, నేడు ప్రతినిధి:** జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా ఈనెల 25న రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల "ఛలో హైదరాబాద్- ఐ అండ్ పీఆర్ ఆఫీస్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో జర్నలిస్టులను పూర్తిగా విస్మరించిందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల తీవ్రమైన వివక్ష చూపుతుందని చెప్పడానికి మొన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెటే నిదర్శనమని అన్నారు. బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేకపోవడం, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇంతవరకు ఇవ్వలేదని, హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ వేయలేదని, పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. ఈ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 25న తలపెట్టిన "ఛలో హైదరాబాద్-ఐ అండ్ పీఆర్ ఆఫీస్" ఆందోళన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాపితంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## సామ్రాజ్యవాదానికి వ్యతిరేక పోరాటమే భగత్‌సింగ్ ఆశయాలకు నిజమైన నివాళి

**కారేపల్లి. నేడు న్యూస్:** భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ ఆశయాలు నెరవేర్చాలంటే సామ్రాజ్యవాదాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిందేనని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) నాయకులు పేర్కొన్నారు. సోమవారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 84వ వర్ధంతి సందర్భంగా కాగడాల ప్రదర్శన నిర్వహించి అనంతరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా అధ్యక్షుడు కే నరేంద్ర, నాయకుడు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న సామ్రాజ్యవాద విధానాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత రూపమైన సామ్రాజ్యవాదం యుద్ధాలకు దారి తీస్తూ ప్రపంచంపై ఆధిపత్యం కోసం దేశాలను లక్ష్యంగా చేసుకుంటోందని విమర్శించారు. ఇరాన్, లేబనాన్, ఇరాక్, లిబియా, వెనుజులా వంటి దేశాలపై జరుగుతున్న దాడులు ఆయుధ వ్యాపారం, చమురు ఆధిపత్యం కోసమేనని ఆరోపించారు. ఈ యుద్ధాల ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడుతూ గ్యాస్, పెట్రోలు, డీజిల్ కొరతతో పాటు ధరల పెరుగుదలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి కోసం యుద్ధాలను వ్యతిరేకించడం, సామ్రాజ్యవాదానికి ఎదురు నిలవడం ద్వారానే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆధర్ల వినయ్ కుమార్, జిల్లా నాయకులు వజ్జా రామారావు, ముండ్ల ఏకాంబరం, యువజన నాయకులు అన్నారపు కృష్ణ, పోడు భూముల సంఘం నాయకులు పాసిని నాగేశ్వరరావు, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు ఆధర్ల గౌతం, లచ్చయ్య, ఎస్ఎఫ్ఐ నాయకుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## ఏకగ్రీవంగా అహ్మద్ గూడ వీకర్ సెక్షన్ కాలనీ నూతన కార్యవర్గం

### అధ్యక్షుడిగా విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా దిలీప్ కుమార్

**కీసర నేడు న్యూస్:** కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ అహ్మద్ గూడ ( బండ్లగూడ) వీకర్ సెక్షన్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు స్థానిక కాలనీ పెద్దల సమక్షంలో అత్యంత ఉత్సాహంగా జరిగాయి. మాజీ సర్పంచ్ గండి యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలలో కాలనీ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా జవాజి విజయ్ కుమార్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా సాల్వే దిలీప్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గండి యాదగిరి గౌడ్ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కాలనీ అభివృద్ధిని ధ్యేయంగా పెట్టుకుని పనిచేయాలని సూచించారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై కమిటీ సభ్యులందరూ ఏకతాటిపై నిలిచి, సమష్టి కృషితో ముందుకు సాగాలని ఆయన కోరారు. నూతన కార్యవర్గ వివరాలు: అధ్యక్షులు: జవాజు విజయ్ కుమార్ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి: సాల్వే దిలీప్ కుమార్, ఉపాధ్యక్షులు: వట్టిపల్లి హరికృష్ణ యాదవ్, ఠాకూర్ రాజు సింగ్, కోశాధికారి: చింతల రాజు ముదిరాజ్, కార్యదర్శులు: జవాజి మణికంఠ ముదిరాజ్, దండేటికర్ బజరంగ్ లాల్, జాయింట్ సెక్రెటరీ పల్లె సాయి గౌడ్, కార్యవర్గ సభ్యులుగా: కొరివి లక్ష్మీనారాయణ ముదిరాజ్, ఎండీ.ఖలీల్ పాషా, బత్తుల ఎల్లయ్య, ఠాకూర్ భవాని సింగ్, దండగల సతీష్, సనాల సురేష్ చారి, గండి నవీన్ గౌడ్, లంకోజు సాయి కృష్ణ చారి, మనుపాటి పరశురాం ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా: గండి యాదగిరి గౌడ్, చింతల ప్రకాష్ ముదిరాజ్, నరేష్ బుచ్చి రెడ్డి, గండి శ్రీనివాస్ గౌడ్, మస్కే తాతారావు, ఆత్మ రావు, కాలే పరమేష్ గారలు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, ప్రజలు పాల్గొని నూతన కమిటీకి తమ మద్దతు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన బాధ్యులను పలువురు అభినందించారు.

